సాక్షి
నిర్మల్
శుక్రవారం । 20 । జూన్ । 2025



బాసరలో పోలీసుల మాక్ డ్రిల్

బాసర గోదావరి నదిలో ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శివంగి, స్పెషల్ టీంలు సుమారు 2 గంటలు నదిలో మాక్ డ్రిల్ చేశారు. 10లో▸

క్రీడా పాఠశాలకు ఎంపిక పోటీలు



నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశానికి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం ఎంపిక పోటీలను నిర్వహించారు. 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి వివిధ క్రీడ అంశాలలో పరీక్షలు నిర్వహించారు. జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, అర్బన్ ఎంఈవో నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.4 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

డిగ్రీలో ప్రవేశాలు



సోన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, సోఫీ నగర్‌లో 2025 -26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(బీజెడ్‌సీ), బీఎస్సీ (ఎంజెడ్‌సీ) ఎంఎస్‌సీఎస్, బీకాం, కంప్యూటర్, బీకాం జనరల్, బీఏ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.కవిత తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్ కళాశాల ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారని తెలిపారు. పూర్తి వివరాలకు 9000599665, 9542556688 సంప్రదించాలని సూచించారు.

దత్తాత్రేయ ఆలయానికి కిలో వెండి విరాళం



వెండిని విరాళంగా ఇస్తున్న దాత

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధి చింతల్‌పేట్ గ్రామంలోని దత్తాత్రేయ స్వామి ఆలయానికి దాత కిలో వెండి విరాళంగా అందజేశారు. కోరుట్ల పట్టణంలోని 32వ వార్డు మాజీ కౌన్సిలర్ జిందం మణి-లక్ష్మీనారాయణ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులకు కిలో వెండిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు మాసుల రాజేశ్వర్, బూర్గుల నగేశ్, పుప్పాల చిన్న నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విదేశీవిద్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర అల్ప సంఖ్యాకవర్గ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు బౌద్ధులు, పార్శీలు) విద్యార్థులు ముఖ్యమంత్రి విదేశీ విద్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అల్ప సంఖ్యాకవర్గ సంక్షేమ శాఖ అధికారి మోహన్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా పేద మైనారిటీలకు రూ.20 లక్షల ఉపకార వేతనం, ఒక వైపు విమాన ఖర్చులు కింద రూ.60 వేలు అందించనున్నట్లు తెలిపారు. డిగ్రీ(ఇంజనీరింగ్)లో 60% మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ చేయాలనుకునేవారు పీజీలో 60శాతం మార్కులు పొందిన వారు అర్హులని వివరించారు. జనవరి -2025 నుంచి జూన్ 2025 మధ్యకాలంలో విదేశీ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొంది ఉన్న మైనారిటీ విద్యార్థులు పథకానికి అర్హులని తెలిపారు. అర్హులైన వారు వెబ్సైట్ www.telanganaepass.cgg.gov.in ద్వారా ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. హార్డ్ కాపీలు సంబంధిత పత్రాలతో జిల్లా అల్పసంఖ్యాకవర్గాల సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

బానిషాలో యువత

‘డ్రగ్ ఫ్రీ నిర్మల్’ చేస్తామంటూ ఉన్నతాధికారులు చొరవ తీసుకున్నా.. జిల్లాలో మత్తుమందు వినియోగం ఏమాత్రం ఆగడం లేదు. పైపెచ్చు.. సరికొత్త మత్తులో యువత చిత్తవుతోంది. చాలాచోట్ల ఉదయం నుంచే గంజాయి మత్తులో జోగుతూ.. రోజంతా ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో ఉంటున్నారు. ఇటీవల జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో ఓ యువకుడి మరణానికి కారణమైన మరో యువకుడు గంజాయి తాగి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. గతంలోనూ జిల్లాలో చాలామంది యువకులు ఇదేమత్తులో రోడ్డుప్రమాదాల బారిన పడి, తమ నిండుప్రాణాలను కోల్పోయారు. తమను కన్నతల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చారు. – నిర్మల్



ఇటీవల ఖానాపూర్ శివారు ప్రాంతాల్లో లభ్యమైన బోనోఫిక్స్

- జిల్లా డ్రగ్ ఫ్రీ చేస్తామంటున్న అధికారులు
- కొత్త డ్రగ్స్ వినియోగిస్తున్న వ్యసనపరులు
- చర్యలు చేపడుతున్నా.. ఆగని గంజాయి

జిల్లాలో మద్యం, సిగరెట్‌లను దాటి యువత కొత్త మత్తుపదార్థాలకు బానిస అవుతోంది. గంజాయి ఒక్కటే సమస్య అనుకుంటే, ఇటీవల సరికొత్త మత్తు రకాలు వెలుగులోకి వస్తున్నాయి. గత నెలలో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రుల్లో పనిచేసే ముగ్గురు ల్యాబ్/ఎక్స్-రే టెక్నీషియన్‌లు, ఓ యువకుడు శస్త్రచికిత్సల్లో వాడే మిడాజోలం ఇంజెక్షన్‌లను యువతకు అక్రమంగా అందజేస్తూ పట్టుబడ్డారు. ఈ మందు అతిమాత్రలో ప్రాణాంతకం. ఇక, ఖానాపూర్‌లో ‘బాటిల్‌షాట్’ అనే కొత్త పద్ధతిలో యువకులు గంజాయి, బోనోఫిక్స్ మిశ్రమాన్ని బాటిల్‌లో రంధ్రం చేసి, పెన్ను మూత ద్వారా పీలుస్తున్నారు. ఈ ప్రమాదకర అలవాటు గురించి తెలియకనే యువ త దీనికి బానిస అవుతోంది. వైట్‌నర్, దగ్గుమందులను కూడా మత్తుకోసం వాడుతున్నవారు ఉన్నారు, ఇది జిల్లా భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుతోంది.

కొత్తకొత్త మత్తుల్లో...

మద్యం, సిగరెట్, గంజాయిని దాటేసి కొత్తకొత్త మత్తుల్లో యువత చిత్తవుతోంది. కొంతకాలంగా గంజాయి ఒక్కటే జిల్లాను కుదిపేస్తోందనుకుంటుంటే.. ఇటీవల సరికొత్త మత్తుపదార్థాల వాడకం వె లుగులోకి వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

- గత నెలలో జిల్లాకేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో పనిచేసే ముగ్గురు ల్యాబ్/ఎక్స్‌రే టెక్నీషియన్‌లు, ఓ యువకుడు శస్త్రచికిత్సల సమయంలో పేషెంట్లకు ఇచ్చే మిడాజోలం అనే మత్తుమందు ఇంజెక్షన్‌లను యువతకు ఇస్తూ పట్టుబడ్డారు. ఈ మత్తు ఏమాత్రం ఎక్కువైనా ప్రాణాలకే ప్రమాదం.
- తాజాగా ఖానాపూర్‌లో పలువురు యువకులు ‘బాటిల్‌షాట్’లకు అలవాటు పడటం కలవరం రేపుతోంది. ఒక బాటిల్‌లో గంజాయి, బోనోఫిక్స్ రెండు మిశ్రమంగా చేసి బాటిల్‌కి చిన్న రంధ్రం చేసి దానికి పెన్ను మూతను బిగించి గంజాయి, బోనోఫిక్స్ మిశ్రమాన్ని పీలుస్తున్నారు. ఇది ఎంత ప్రమాదకరమో తెలియకుండానే పీల్చేస్తున్నారు.
- వైట్‌నర్, దగ్గుమందులనూ మత్తుకోసం వాడుతున్నవారు ఉన్నారు. గంజాయితో పాటు ఇలా కొత్తకొత్త మత్తుల కోసం జిల్లా యువత పెడతోవలో పోతుండటం కలవరపెడుతోంది.

అధికారుల చొరవ..

‘డ్రగ్ ఫ్రీ నిర్మల్’ లక్ష్యంతో కలెక్టర్, ‘గాంజా గస్తీ’ కింద ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అవగాహన కార్యక్రమాలు, పోలీసు దాడులు, కళాజాతలతో ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ, గంజాయి విక్రయాలు, మత్తు వాడకం తగ్గడం లేదు. జిల్లా కేంద్రం, శివారు ప్రాంతాల్లో ఈ దందా కొనసాగుతోంది.

ప్రత్యేక వ్యూహం

మత్తురహిత జిల్లా కోసం పోలీసు, అబ్కారీ శాఖలు, జిల్లా అధికారులు సమన్వయంతో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలల్లో కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామాల్లో అభివృద్ధి కమిటీల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలి. సమాచారం ఆధారంగా స్పందించే బదులు, మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతర పర్యవేక్షణ, కఠిన చర్యలు అవసరం. యువతను ఈ ఉచ్చు నుంచి కాపాడేందుకు సమగ్ర విధానం తప్పనిసరి.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగపూర్: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మండలంలోని జామ్ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలకు కారణాలు తెలుసుకున్నారు. గ్రామంలో భూములకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామస్తులను అడుగగా 582 సర్వే నంబరులో ఉన్న భూసమస్యలను గురించి రైతులు, గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. 582 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో అసైన్డ్ పట్టాలు ఇవ్వడంతో ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం లేకుండా పోయిందని తెలిపారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి కమిటీని ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న ప్రతీ రైతుకు రశీదు ఇవ్వడంతోపాటు తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవికి సూచించారు. అవసరమైతే సర్వేయర్ సహాయంతో క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశించారు.

పాఠశాల తనిఖీ

రెవెన్యూ సదస్సు పరిశీలన అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. స్టాఫ్ రూమ్‌కు వెళ్లి హాజరు రిజిష్టర్లు పరిశీలించారు. అక్కడి నుంచి మధ్యాహ్న భోజనం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తయారు చేసిన భోజనం పరిశీలించారు. అక్కడి నుంచి నేరుగా పదోతరగతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను పలకరించి పలు విషయాలపై ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. పదోతరగతి వార్షిక పరీక్షలకు ముందు నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు అభిలాష్ నెట్‌బాల్‌లో, రమ్య బేస్‌బాల్‌లో జాతీయస్థాయికి ఎంపికైన విషయం తెలుసుకుని అభినందించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రా మారావు, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది..?

- అవినీతి పెరిగినందునే ఏసీబీ దాడులు
- అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ‘అసలు నిర్మల్ మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది..? అధికారులు ఏం పని చేస్తున్నారు..? వరుసగా ఏసీబీ దాడులు జరుగుతున్నాయంటే ఇక్కడ ఎంత అవినీతి జరుగుతుందో అర్థమవుతోంది. ప్రజలకు సేవలు అందించకుండా, చేస్తున్న పనులపై కనీసం అవగాహన లేకుండా, కేవలం సంపాదనపైనే దృష్టి పెడతామంటే కుదరదు. అలాంటి అధికారులు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోవచ్చు. అధికారులు సిబ్బంది నిబద్ధతతో పని చేయాల్సిందే..’ అని బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మున్సిపల్‌లో జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. ఆయా శాఖలలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీలో జరుగుతున్న ఆయా పనుల పురోగతిపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

అవినీతిపై ఆగ్రహం...

నిర్మల్ మున్సిపాలిటీ ఇటీవల ముద్రపడ్డ అవినీతికి కేరాఫ్‌గా మారిందంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు వరుసగా జరుగుతున్న ఏసీబీ దాడులే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు పనుల నిమిత్తం మున్సిపాలిటీకి వచ్చినప్పుడు ఏం ఆశించకుండా పనులు చేయాలని సూచించారు. నిర్మల్‌లో సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, డీఈ హరిభువన్, ఆర్‌వో అనుప్‌కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమపై ఆంక్షలు ఎత్తివేయాలి

సోన్: బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన కోట్పా చట్టాన్ని రద్దు చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. ఈనెల 21, 22న నిజామాబాద్‌లో నిర్వహించే టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సోన్ మండలం జాఫ్రాపూర్‌లో ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమతో ఏడు లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చర్యలతో వీరికి ఉపాధి కరువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న జీవన భృతి ప్రకారం కేంద్ర ప్రభుత్వం కూడా జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ)జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, ఎ.నవీన్, జమున, లక్ష్మి, విజయ, గంగమణి తదితరులు పాల్గొన్నారు.



జాఫ్రాపూర్‌లో బీడీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న

డయేరియాపై యుద్ధం

- 45 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లాలో 73,715 మంది చిన్నారులకు ఓఆర్ఎస్, జింక్ మాత్రలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ డయేరియల్ కంట్రోల్ ఫోర్ట్‌నైట్ (ఐడీసీఎఫ్) కార్యక్రమం ఈనెల 16న ప్రారంభమై, వచ్చే నెల 31 వరకు 45 రోజులపాటు జరగనుంది. 5 ఏళ్ల చిన్నారుల్లో నీళ్ల విరేచనాల నియంత్రణ లక్ష్యంగా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల ద్వారా పంపిణీ చేస్తారు. గ్రామస్థాయిలో ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో ప్రతీ చిన్నారికి ఈ సదుపాయం అందిస్తారు. వర్షాకాలంలో డయేరియా ప్రభావం పెరగడంతో, ఓఆర్ఎస్ ద్రావణంతో శరీరంలో కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను పునరుద్ధరిస్తారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారుల గుర్తింపు

జిల్లాలో 1,88,929 కుటుంబాల సర్వేలో 5 ఏళ్లలోపు 73,715 మంది చిన్నారులను గుర్తించారు. 160 ఏఎన్ఎంలు, 568 ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ఇస్తారు.

పక్కా ప్రణాళికతో..

జిల్లాలో గుర్తించిన 5 ఏళ్ల లోపు చిన్నారులందరికీ ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందిస్తాం. 45 రోజులపాటు సాగే ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఏ ఒక్కరూ డయేరియాతో మృతి చెందొద్దనే లక్ష్యంతో కృషిచేస్తున్నాం. – డాక్టర్ నైనారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

జింక్ మాత్రల ప్రయోజనాలు

జింక్ మాత్రలు డయేరియా సంఖ్యను తగ్గించి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. 14 రోజుల వినియోగంతో నీళ్ల విరేచనాలు, న్యూమోనియా నివారణ సాధ్యమవుతుంది. డయేరియా వల్ల చిన్నారులు నీరసించకుండా, 13 లక్షల ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 38,429 జింక్ మాత్రలను సిద్ధం చేశారు. ఇటుక బట్టీలు, సంచార జాతుల ప్రాంతాల్లో వాహనాల ద్వారా సేవలు అందిస్తారు

అసంపూర్తి బడి

- వేధిస్తున్న అసౌకర్యాలు
- మరుగుదొడ్లు సరిపడా లేక అవస్థలు
- పెండింగ్‌లోనే తరగతి గదుల నిర్మాణ పనులు
- ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు
- సాక్షి విజిట్‌లో తేటతెల్లం



నిర్మల్ రూరల్ మండలం గంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్డు లేకపోవడంతో వరండాలోనే మధ్యాహ్న భోజనం వండుతున్నారు. గత విద్యా సంవత్సరం యూడైస్‌లో ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా ఈసారి బడిబాటలో నలుగురు పెరిగి సంఖ్య పదికి చేరింది. ఒకే గదిలో అంగన్‌వాడీ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు చదువుకుంటున్నారు.



ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాల లోనిది. ఇక్కడ మొత్తం విద్యార్థుల సంఖ్య 244. ఇందులో 134 మంది బాలికలు ఉన్నారు. కానీ వీరందరికీ ఒకే ఒక టాయిలెట్ ఉండడంతో విద్యార్థినిలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్ల క్రితం మన ఊరు- మనబడి లో కొత్త మరుగుదొడ్లు మంజూరయ్యాయి. అవి కట్టే క్రమంలో ఉన్న మరుగుదొడ్లను కూల్చివేశారు. ప్రస్తుతం పాడుబడ్డ ఓ టాయిలెట్ మాత్రమే ఉంది.

నిర్మల్ రూరల్: సర్కారు బడుల్లో విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలతో పనులు చేపట్టినా ఇంకా పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మన ఊరు-మన బడి పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాక్షి జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలను విజిట్ చేయగా, ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- మండలంలోని రానాపూర్ ప్రాథమిక పాఠశాలలో మూడు తరగతి గదులు ఉండగా అందులో ఓ గదిని గ్రామపంచాయతీ కోసం, మరొక గది అంగన్‌వాడీ విద్యార్థుల కోసం ఉపయోగిస్తున్నారు. కొన్నేళ్లుగా కొత్త గ్రామపంచాయతీ భవనం పెండింగ్‌లో ఉండడంతో పరిపాలన మొత్తం పాఠశాల నుంచే జరుగుతుంది. మధ్యాహ్న భోజన షెడ్డు లేకపోవడంతో పాఠశాల ఎదురుగా ఓ ఇంట్లో తయారుచేసి బడికి తీసుకువస్తున్నారు. డ్యాంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. గురువారం సాక్షి విజిట్‌కి వెళ్లినప్పుడు అక్కడ ఉపాధ్యాయుడు, విద్యార్థులు ఎవరూ లేరు. మధ్యాహ్న భోజన భోజనం తయారు చేసే ఓ మహిళ మాత్రమే ఉంది. అడిగితే సారు... కొత్త పుస్తకాలు తేడానికి చిట్యాల బడికి వెళ్లాడని సమాధానం ఇచ్చింది. ఇదే అదనుగా.. బడికి వచ్చిన విద్యార్థులంతా ఇంటికి వెళ్లిపోయారని పేర్కొంది.

పనులు నిలిపివేశారు....



కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం

సారంగపూర్: మండలంలోని జామ్ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షలతో చేపట్టిన డైనింగ్ హాల్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రూ.3 లక్షలు ఇంకా విడుదల కాకపోవడంతో సదరు కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ఆరుబయట భోజనాలు చేసే పరిస్థితి. జామ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో 50 లక్షలతో ఇటీవలే నూతన భవనం నిర్మించారు. పాతభవనం కూలడానికి సిద్ధంగా ఉంది. మంచినీళ్ల ట్యాంకు కోసం దానిని అలాగే ఉంచేశారు. అది కూలిపోతే పెను ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయి.

తరగతులు సరిపోక..

భైంసాటౌన్: పట్టణంలోని మదీనాకాలనీ లోగల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, ఉర్దూ మీడియం తరగతులు నిర్వహిస్తున్నారు. 265 వరకు విద్యార్థులు ఉన్నారు. పది తరగతి గదులు అవసరం. ఐదు గదులే అందుబాటులో ఉన్నాయి. మన ఊరు-మన బడి పనులు మధ్యలో నిలిచాయి.

ఒకే గదిలో ఐదు తరగతులు..

కడెం: మండలంలోని ఉడుంపూర్ జీపీ పరిధి గండిగోపాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లున్నారు. ఐదు తరగతులు ఒకే గదిలో కొనసాగుతున్నాయి. అదనపు గదులు అసంపూర్తిగా ఉన్నాయి.

భవనం ప్రారంభించక..



మూత్రశాల వద్ద బారులు తీరిన చిన్నారులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు గత ఏడాది రూ.కోటి నిధులతో నిర్మించిన నూతన భవనం ఉన్నప్పటికీ దానిని ప్రారంభించకపోవడంతో పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. గ్రామంలో పురాతన భవనం ఉన్నప్పటికీ అది పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. దీంతో మండల అధికారుల సూచన మేరకు ఉపాధ్యాయులు విద్యార్థుల తరగతుల నిర్వహణను పురాతన భవనంలో కాకుండా సమీపంలోని ఇతర భవనాల్లో కొనసాగించాల్సి వస్తోంది.

ఇబ్బందుల మధ్యనే..

లక్ష్మణచాంద: మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను విజిట్ చేయగా ఇక్కడ ఒక తరగతి ఇండోర్ షటిల్ కోర్టులో నిర్వహిస్తుండగా, మూడు తరగతులు అసంపూర్తి భవనంలో నిర్వహిస్తున్నారు. ఉన్న గదులు శిథిలావస్థకు చేరి వర్షంకు ఉరుస్తాయని ఉన్నతాధికారుల ఆదేశాలే మేరకు అందులో తరగతులు నిర్వహించడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. పొట్టపెల్లి ప్రాథమిక పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో పై కప్పు రేకులకు రంధ్రాలు పడ్డాయి.



అసంపూర్తి భవనంలో తరగతులు

స్లాబ్ కిందే చదువులు



స్లాబ్ కింద బోధిస్తున్న ఉపాధ్యాయులు

భైంసారూరల్: మండలంలోని కుంసర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్లాబ్ కిందే పాఠాలు నేర్చుకుంటున్నారు. మన ఊరు మన బడిలో నూతన భవన నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరు చేశారు. మూడేళ్ల క్రితం స్లాబ్ వేశారు. ఏళ్లు గడుస్తున్న చుట్టు గోడలు నిర్మించలేదు. రోడ్డుపై వెళ్లే వాహనాల శబ్దంతో విద్యార్థులు పాఠాలు వినలేకపోతున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు, 45 మంది విద్యార్థులు ఉన్నారు. మాంజ్రి ప్రాథమిక పాఠశాల భవనానికి తలుపులు కిటికీలు లేవు. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు 50 మంది విద్యార్థులు ఉన్నారు.

టీచర్ ఉన్నా పిల్లలు లేరు..!



తాళం వేసి ఉన్న పాఠశాల

కుంటాల: కుంటాల మండలంలోని దొనెల్లి తాండ, గామాపూర్ తండా, పాత వెంకూర్, లింబా(కె) ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులు లేక మూతపడ్డాయి. మండలంలోని కొత్త వెంకూర్ పాఠశాలల్లో టీచర్ ఉన్నా పిల్లలు లేరు.గురువారం బడికి తాళం వేసి ఉంది. టీచర్ సెలవులో ఉన్నారని కాంప్లెక్స్ హెచ్ఎం రాజేశ్వర్ తెలిపారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌వీ నాయకుడిపై దాడి



ఆస్పత్రిలో బాధితుడు మధూకర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గురువారం రాత్రి నస్పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌వీ నాయకుడు దగ్గుల మధూకర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటన కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు నస్పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సురిమిల్ల వేణు, మధూకర్ చిన్ననాటి స్నేహితులు. చాలా కాలం తర్వాత ఇద్దరూ కలుసుకోవడంతో నస్పూర్‌లో మందుపార్టీ చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ కలిసి జిల్లా కేంద్రంలోని ప్రముఖ రియల్టర్ జగన్ మోహన్‌రావు ఇంటికి వెళ్లారు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికి అరికె రాజేశ్, కుమార్, వంశీ మధూకర్‌పై దాడి చేశారు. తలకు గాయం కావడంతో తప్పించుకుని పారిపోయి స్నేహితులకు సమాచారం అందించగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఆస్పత్రికి చేరుకున్నారు. సీఐ ప్రమోద్‌రావు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు.

రైతు వేదికలో చోరీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ముందు వైపు తాళాన్ని పగులగొట్టి లోనికి చొరబడ్డారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉందని, లోనికి వెళ్లి చూడగా కంప్యూటర్, స్పీకర్లు ఎత్తుకెళ్లినట్లు ఏఈవో సాయికృష్ణ తెలిపారు. ఈ విషయమై చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణ సీఐ దేవేందర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పట్టపగలే సినీఫక్కీలో..

లక్సెట్టిపేట: పట్టణంలో పట్టపగలే సినీఫక్కీలో చోరీ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండలంలోని కొమ్ముగూడెంకు చెందిన వ్యాపారి కిషన్ గురువారం మధ్యాహ్నం పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణం వద్దకు వచ్చి లక్ష రూపాయల నగదు తీసుకుని బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకుని స్థానిక బీట్ బజార్ నుండి బస్టాండు వైపు బయల్దేరాడు. గాంధీచౌక్ సమీపంలోకి వెళ్లగానే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి డబ్బులు కింద పడ్డాయని చెప్పడంతో కిషన్ బైక్ ఆపి కిందకు చూస్తుండగా కవర్‌లో ఉన్న నగదు పట్టుకుని పారిపోయారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఆదిలాబాద్‌లో ఇంట్లో..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఆవరణలో నిద్రపోయాడు. దొంగలు ఇంట్లో చొరబడి 15 తులాల వెండి, 14 గ్రాముల బంగారం దోచుకెళ్లారు. ఉదయం లేచి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేయగా సీఐ కరుణాకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అటవీ సిబ్బందిపై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

భీమారం: రిజర్వు ఫారెస్ట్ నుంచి ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న అటవీశాఖ సిబ్బందిపై దాడికి యత్నించిన బూర్గుపల్లి గ్రామానికి చెందిన బుక్యా రాజ్‌కుమార్‌నాయక్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న దాంపూర్ అటవీ ప్రాంతంనుంచి ఇసుక తరలిస్తుండగా అటవీశాఖ సిబ్బంది మార్గమధ్యలో ఆపి ట్రాక్టర్‌ను మంచిర్యాలలోని రేంజ్ ఆఫీస్‌కు తరలిస్తుండగా రాజ్‌కుమార్ వారిపై దాడికి యత్నించి ట్రాక్టర్ తీసుకెళ్లాడు. నోటీసులు ఇచ్చేందుకు బూర్గుపల్లిలోని అతని ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు దుర్భాషలాడారన్నారు. గతంలో కూడా మూడుసార్లు ఇసుక తరలిస్తుండగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో కప్పర్లవాసి ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

తాంసి: మండలంలోని కప్పర్లకు చెందిన జాజిమొగ్గ శంకర్ (58) గురువారం హైదరాబాద్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సవిత తెలిపారు. కప్పర్ల గ్రామానికి చెందిన శంకర్ కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. బోరబండ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో కళాశాల ఆవరణలో ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం గమనించిన సిబ్బంది పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య పొచ్చు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దండిగల్ ఎస్సై తెలిపారు.

పోడు.. తీరని గోడు!



పోడు సాగు చేస్తున్న రైతు(ఫైల్)

- పట్టాలు ఇచ్చినా ఇంకా సమస్యలే
- కొన్నిచోట్ల అనర్హులకు హక్కుల కల్పన
- మరికొన్ని చోట్ల అర్హులకు దక్కని అవకాశం
- విత్తనం వేసే వేళ అధికారులు, సాగుదారులకు ఘర్షణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అటవీ భూముల సాగుపై వివాదం ఆగడం లేదు. ఏటా వానాకాలం విత్తనాలు వేసే వేళ అటవీ అధికారులు, ఆక్రమణదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. పట్టా లేకుండా సాగు చేస్తే వారి నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. శాటిలైట్ మ్యాపులతో నిర్ధారిస్తూ మొక్కలు పెడుతున్నారు. రెవెన్యూ పట్టాలు ఉన్నప్పటికీ అటవీ భూమిగా రికార్డుల్లో ఉంటే స్వాధీనం చేసుకుంటున్నారు. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్ గిరిజన రైతులు, మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం చామనపల్లికి చెందిన దళిత రైతులకు రెవెన్యూ పట్టాలు ఉన్నప్పటికీ అటవీ భూమిగా స్వాధీనం చేసుకునే క్రమంలో ఇరువర్గాల్లో గొడవ జరుగుతోంది.

రెండుసార్లు పట్టాలిచ్చినా..

ఉమ్మడి ఏపీలో దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. 2023లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 1,50,012 మంది రైతులకు 4,05,601 ఎకరాల భూమికి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు అందజేశారు. ఇందులో అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పట్టాలు అందజేయగా రెండో స్థానంలో మహబూబాబాద్ జిల్లా గిరిజనులకు పట్టాలిచ్చారు. అర్హులను గుర్తించేందుకు ఆర్వోఎఫ్ఆర్(అటవీ హక్కుల గుర్తింపు చట్టం) 2006 ప్రకారం సాగు హక్కులు కల్పించాలని జీవో 140 ప్రకారం దరఖాస్తులు స్వీకరించింది. ఎఫ్ఆర్సీ(ఫారెస్టు రైట్స్ కమిటీ)లను పోడు సాగు గ్రామాల నుంచే సభ్యులను ఎంపిక చేసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేశారు. ప్రధాన నిబంధనల్లో గిరిజనులు 2005 డిసెంబర్ 12 నాటికే అటవీభూమి సాగులో ఉండాలి. గిరిజనేతరులు 75 ఏళ్లు అంటే 1930 కంటే ముందు నుంచి లేదా మూడు తరాలు సాగులో ఉన్నట్లు రుజువు అడిగారు. బీట్ ఆఫీసరు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి పరిశీలన చేసి సంతకాలు తీసుకున్నారు. గిరిజనేతరులు సాగులో ఉన్నా పట్టాలు రాలేదు.

అనర్హులకు అటవీ భూమి

మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల్లో ప్రభుత్వ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖతో పాటు ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లో ఉద్యోగాలు చేస్తున్న దాదాపు 120 మంది ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేసి దొడ్డి దారిన ఎకరాల కొద్దీ అటవీభూమి తమపరం చేసుకున్నారు. కుమురంభీం జిల్లాలో కెరమెరి, జైనూర్, దహెగాం మండలాల్లో కొందరు గిరిజనేతరులు సాగులో ఉన్న భూములకు గిరిజనుల పేర్లు వాడుకుని ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు చేయించారు. సిర్పూర్ నియోజకవర్గంలో అక్రమంగా కొందరు గిరిజనేతరులు పట్టాలు పొందాక, తర్వాత రద్దు చేశారు.

నిత్యం ఘర్షణ

శాటిలైట్ మ్యాపులతో గతంలో ఉన్న అటవీ, ప్రస్తుతమున్న పరిస్థితిని పోల్చుతూ అటవీ అధికారులు ఆక్రమణలు తిరిగి స్వాధీనం చేసుకునే పనిలో ఉన్నారు. ఏటా విత్తనాలు వేసే సమయంలో రైతులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. మంచిర్యాల, కొత్తగూడెం, ములుగు, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల్లో మళ్లీ సర్వే చేసి అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మాపై కేసులు పెట్టారు



మేము మూడెకరాలు పోడు సాగు చేసుకుంటున్నాం. మా గ్రామాన్ని పోడు సాగులో గుర్తించకపోవడంతో సర్వే చేయలేదు. పట్టాలు ఇవ్వలేదు. ఫారెస్టు అధికారులు వచ్చి మీకు పట్టా లేదు.. భూమి దున్నకూడదని అంటూ మాపై కేసులు పెట్టారు. మా గ్రామంలోనూ సర్వే చేసి పట్టాలు ఇవ్వాలి.

– మర్మల మల్లేశ్వరి, బుయ్యారం, వేమనపల్లి, మంచిర్యాల

అర్హులని గుర్తించినా పట్టా ఇవ్వలే



ఉమ్మడి ఏపీలోనే అర్హులుగా గుర్తించినా మాకు పట్టా ఇవ్వలేదు. రెండేళ్ల క్రితం సర్వేలోనూ మాకు పట్టా ఇవ్వలేదు. ఇప్పుడు భూమి సాగు చేసుకుంటుంటే అటవీ అధికారులు వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు.

– గుజిగంటి ప్రకాశ్, ఇందన్‌పల్లి, జన్నారం, మంచిర్యాల

సాగు కష్టాలు



అర్క ముందు ఎడ్లను లాగుతున్న మహిళ

ఖరీఫ్ ప్రారంభంతోనే రైతులకు సాగు కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని జిల్డా గ్రామంలో జాదవ్ చందులాల్ అనే గిరిజన రైతు గురువారం తమ పత్తిచేనులో దౌర కొడుతున్నాడు. కానీ ఎద్దులు కలుపుడు కంకలు కావడంతో సరిగ్గా నడవలేక పోయాయి. దీంతో అరకకు తాడుకట్టి రైతు భార్య ముందు నడుస్తుంటే కలుపుడు కంకలు ఆమెను అనుసరించాయి. ఈ దృశ్యం సాగులో రైతు పడుతున్న కష్టానికి అద్దం పడుతోంది. – ఇచ్చోడ

ఇళ్లస్థలాలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ద్వారా ఇళ్లస్థలాలు ఇప్పిస్తానని ప్రజల వద్ద డబ్బులు తీసుకుని మోసగించిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని మసూద్‌నగర్‌కు చెందిన మహ్మద్ తాజొద్దీన్ అలియాస్ షాకీర్ నిర్మల్ కోర్టులో టైపిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలో పదుల సంఖ్యలో బాధితుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షన్నర వరకు తీసుకున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ఖానాపూర్ శివారులోని సర్వే నం.29/1లో ఖాళీ ప్రదేశాలను చూపించి జిరాక్స్ నకిలీ పత్రాలను వారికి అందించి మోసగించాడు. బాధితులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని భైంసాలో అరెస్టు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇతనిపై పలు కేసులు నమోదైనట్లు వివరించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈసెట్ కౌన్సెలింగ్



ధ్రువీకరణ పత్రం పరిశీలిస్తున్న అధికారి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో చేపట్టిన టీఎస్‌ఈసెట్–2025 కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. అధికారులు మూడు రోజుల పాటు అభ్యర్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. 575 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోగా 564 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్ తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్: నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం కోటపల్లి పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి రాపనపల్లి అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా కిష్టాపూర్‌కు చెందిన గూడ మనోహర్‌రెడ్డి కారులో 48.6 కిలోల పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. వాటి విలువ రూ.1,45,800 ఉంటుందన్నారు. సిరోంచకు చెందిన చింతవార్ శ్రీనివాస్, సింగిడివార్ నరేశ్‌తో కలిసి నాగపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మంచిర్యాల జిల్లాతో పాటు మహారాష్ట్రలో విక్రయించేందుకు తీసుకువస్తున్నట్లు ఒప్పుకున్నాడు. మనోహర్‌రెడ్డి పట్టుబడగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. 2018, 2025లో కూడా మనోహర్‌రెడ్డిపై జైపూర్, తాండూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో చెన్నూర్, శ్రీరాంపూర్ సీఐలు దేవేందర్‌రావు, వేణుచందర్, కోటపల్లి ఎస్సై రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ పోరాటం



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల సమస్యలపై గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ పోరాడుతోందని ఆ సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేకే–5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చామన్నారు. కార్మికుల సొంతింటి కల, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రద్దు విషయంలో మంత్రి వివేక్‌ను కలిసి విన్నవించామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆ యూనియన్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో యూనియన్ ఏరియా బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు అక్బర్‌అలీ, సుదర్శన్, మల్లేశ్, కంది శ్రీనివాస్, సంపత్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లిలో చోరీకి పాల్పడిన ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన పుత్తక వేణుగోపాల్ తన చెల్లితో కలిసి బెల్లంపల్లి మార్కెట్‌కు వెళ్లి వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని రూ.3 వేల నగదు దొంగిలించినట్లు గుర్తించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మధ్యాహ్నం నిందితుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రస్తుతం చంద్రవెల్లిలో ఉంటున్న మహ్మద్ నదీంను మధుర జంక్షన్ వద్ద పట్టుకున్నారు. దొంగిలించిన నగదును సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట శివారులో గల బుగ్గ గట్టు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలిశెట్టి శ్రీనివాస్ (42) మృతి చెందినట్లు హాజీపూర్ ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. ముల్కల్లకు చెందిన శ్రీనివాస్ లక్సెట్టిపేటలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఏసీపీ ప్రకాశ్ పరిశీలించారు. మృతునికి భార్య జ్యోతి, కుమారుడు అభిరామ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచారం కేసులో మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి శివరాంప్రసాద్ గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. నార్నూర్ మండలంలోని బాబేఝరి గ్రామానికి చెందిన ఓ యువతిని బేల మండలంలోని పాటగూడకు చెందిన జలపత్‌రావు నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భం దాల్చడంతో వేరే పెళ్లి చేసుకోవాలని, తనకు సంబంధం లేదని పేర్కొన్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శ్రీకాంత్ 2017 జూన్ 5న కేసు నమోదు చేశారు. ఆడ శిశువు జన్మించగా డీఎన్ఏతో నిందితుడు తండ్రిగా నిర్ధారణ అయ్యింది. పది మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ సంజయ్ కుమార్ వైరాగ్రే నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు వివరించారు.

మట్కా నిర్వాహకుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఫర్జాన, షబాన ఆన్‌లైన్ ద్వారా మట్కా నిర్వహణ చేపడుతుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు గురువారం దాడిచేసి పట్టుకున్నారు. మహారాష్ట్రలోని బోరికి చెందిన అశోక్ సామ్రాట్‌కు ఫోన్ ద్వారా మట్కా చీటీలను పంపుతున్నారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వివరించారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

బజార్‌హత్నూర్: మండలంలోని టెంబి గ్రామానికి చెందిన సిడం భీంరావ్ గతంలో గుడుంబా తయారు చేస్తూ ఎక్సైజ్ శాఖ అధికారులకు పట్టుబడటంతో తహసీల్దార్ రూ.50 వేలు బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా తయారు చేయడంతో బైండోవర్ ఉల్లంఘించినందుకు గురువారం భీంరావ్‌కు రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

ఒకరి బలవన్మరణం



సత్తయ్య (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మండలంలోని టీకానాపల్లి గ్రామానికి చెందిన చాకపల్లి సత్తయ్య (45) బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై స్వరూప్ రాజ్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్తయ్య కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ, ఇతర కారణాలతో అప్పులు చేయడంతో మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు సిద్దార్థ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి బైండోవర్

సాత్నాల: బోరజ్ మండలంలోని లేఖర్‌వాడ గ్రామానికి చెందిన కోరిం ఆడేల్లు, పెండల్వాడ గ్రామానికి చెందిన కాపిడే అశోక్‌ను గురువారం తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేశారు. అక్రమంగా దేశీదారు విక్రయిస్తున్న నిందితులపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె పేర్కొన్నారు.

ఇంకుడు గుంత.. మేలు కొండంత

- భూగర్భ జలాల పెంపునకు దోహదం
- ఉపాధిహామీ పథకం కింద నిర్మించుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



సుద్దాలలో నిర్మించిన ఇంకుడుగుంత

చెన్నూర్‌రూరల్: వర్షాలు సక్రమంగా కురియకపోవడం, దీనికి తోడు వేసవిలో భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు అడుగంటిపోయి బావులు, వాగులు, కుంటలు, రక్షిత మంచినీటి పథకాలు, చేతిపంపులు, బోరుబావుల్లో నీరు రాకుండా పోతోంది. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోంది. ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మించుకుంటే రూ.6వేల వరకు, గ్రామాల్లో బోర్ల వద్ద నిర్మించుకుంటే రూ.14 వేల వరకు చెల్లిస్తుంది. రాబోయే రోజుల్లో భూగర్భజలమట్టం పడిపోయి నీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం భవిష్యత్‌లో అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు వచ్చింది. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు, పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది. ఇంటి నుంచి వచ్చే మురుగు నీరంతా ఒకేచోట చేరడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడే అవకాశాలు ఉంటాయి. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకుని బాత్‌రూంల వద్ద పైప్‌లైన్ ఏర్పాటుచేసి మురుగు నీరంతా అందులోకి వెళ్లేలా చేసుకోవాలి. ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణానికి పొడవు.1.2 మీటర్లు, వెడల్పు 1.2 మీటర్లు, లోతు 1.8 మీటర్లు ఉండాలి. గ్రామాలలో బోర్ల వద్ద పొడవు, వెడల్పు, లోతు 2మీటర్ల చొప్పున ఉండేలా నిర్మించుకోవాలి. మండలానికి వంద చొప్పున ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలతో పాటు పంచాయతీకి ఒకటి రెండు చొప్పున మురుగు కాలువల ముగింపు వద్ద నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఈనెలాఖరు వరకు ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.

దరఖాస్తు విధానం ఇలా..

ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేసుకోవాలంటే జాబ్‌కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీ తీర్మానాన్ని ఈజీఎస్ కార్యాలయంలో అందించాలి. అనంతరం ఇంకుడు గుంత నిర్మించే స్థలాన్ని అధికారులు పరిశీలిస్తారు. నిర్మాణం పూర్తయిన వెంటనే బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. గ్రామాలలో నిర్మించే పబ్లిక్ ఇంకుడు గుంతల నిర్మాణాల కోసం పంచాయతీ తీర్మాణం అవసరం ఉంటుంది. వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాల్లో తేడా ఉంటుంది. ఇంకుడు గుంత నిర్మాణంలో ముందుగా బెండడి రాళ్లు వేస్తారు. వాటిపై దొడ్డు, సన్నపు కంకరతో పాటు ఇసుక వేసి మధ్యలో గోళెం అమర్చి దానికి పైపును బిగిస్తారు. అనంతరం పైన మూతను ఏర్పాటు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా డబ్బులు అందజేస్తుంది. గ్రామాలలో ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గంగాభవాని, ఈజీఎస్ ఏపీవో, చెన్నూర్

బాసరలో పోలీసుల మాక్ డ్రిల్



గోదావరిలో మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎస్పీ

బాసర: బాసర గోదావరి నదిలో గురువారం ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శివంగి, స్పెషల్ టీంలు సుమారు 2 గంటల పాటు నదిలో మాక్ డ్రిల్ చేశారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వరద నీటిలో ప్రాణాలు ఎలా కాపాడాలో పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.

బంగల్‌పేట్ చెరువులో 82 మందికి శిక్షణ

నిర్మల్‌టౌన్: ఆపత్కాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధం చేస్తున్నట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని డిస్ట్రిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీడీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో డీడీఆర్ఎఫ్ బృందానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతీ పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 82 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, క్రిష్ణ, డీడీఆర్ఎఫ్ ఇన్‌చార్జి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణకోసం కప్పతల్లి ఆట



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌టౌన్: వరుణ దేవుడు కరుణ చూపాలని ఆగ్రో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కప్పతల్లి ఆటలాడారు. స్థానిక పంజాబ్ చౌక్ నుంచి డప్పు చప్పుళ్లతో అశోక్ రోడ్‌లోని పోచ్చమ్మ తల్లి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం దుకాణాదారులు కప్ప, రోలుకు జలాభిషేకం చేశారు.

బేల: మండల కేంద్రంలోని వ్యవసాయ అనుసంధాన వర్కర్స్ ఆధ్వర్యంలో స్థానిక గణేశ్ మందిరంలో వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. కప్పతల్లి ఆట ఆడారు. మార్కెట్ కూడలిలోని విత్తన విక్రయ కేంద్రాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. రామ మందిరంలో అన్నదానం చేశారు.

108 ఉద్యోగులకు ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన 108 సిబ్బంది

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని 108 వాహనాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఈఎంటీ, పైలట్లకు ఈ నెల 16 నుంచి ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్), సీపీఆర్‌లపై ప్రత్యేక శిక్షణతో పాటు, 108 అంబులెన్సు సర్వీసులను పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేస్తుండడంతో వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం చెన్నూరు ఈఎంటీ పోచన్న, వేమనపల్లి ఈఎంటీ జాడి స్వరూపకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో 108 రాష్ట్ర ప్రధాన కార్యాలయాల అధికారులు గజేందర్, ప్రమోద్, ప్రధాన అధికారి సూర్యనారాయణ రాజు, ఉమ్మడి జిల్లా 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, సంపత్, లింగాచారి, సతీశ్ పాల్గొన్నారు.